స్కెచ్

# శ్రుతిమించిన సయ్యాట

"రాంగేయ"

ఎంత తనని తాను సముదాయించుకున్నా పార్వతికి ఉక్రోషం ఆగడంలేదు. ఇంతకీ యిదెప్పుడూ ఉన్న వరసే! రామారావు తనని ఉడికించే మాటలనడం యిదేమీ కొత్తకాదు. పౌరుషమైన వేళాకోళపు మాటలు రామారావు అనడమూ తను ఉడుకు మోతుతనంతో కుతకుతలాడటమూ- తిరిగి రామారావు తనని బుజ్జగించటమూ- ఎప్పుడూ పరిపాటే! అలాగని రామారావు అవహేళన చెయ్యడమూ మానడు. తను ఉక్రోషపడకనూ మానదు.

ఐనా తను బాధపడతానని తెలిసికూడా రామారావు యింత చిన్నవిషయాలను కొండంతలు చేసి సూటిపోటు మాటలతో తన గుండెల్లో బాధ రగిల్చి కన్నీళ్ళు తెప్పించడమెందుకు? మళ్ళీ తనను దగ్గరకు తీసికొని చిన్నపిల్లని బుజ్జగించినట్లు బుజ్జగించడమెందుకు? ఇలా చేస్తేనేగాని రామారావు ప్రణయానికి తృప్తిలేదేమో! ఐనా రామారావు తరహా తెలిసుండికూడా తను మాత్రం ఎందుకంత ఉడికిపోవాలి? ఒక్కొక్కప్పుడు రామారావు విసిరే పరుషమైన వ్యంగ్యానికి యిక ఆయన పిలిచినా పలుకకూడదనే అనిపిస్తుంది. కాని రామారావు పిల్లిలాగ వచ్చి—

"క్షమించు పార్వతీ! పరిహాసానికన్న మాటలకి నువ్వింతగా బాధపడతావనుకోలేదు" అంటూ తన చేతుల్ని బుజాలమీద వేసుకొని తనను దగ్గరకు తీసుకుంటే తనకోపంతోపాటే తనూ కరిగిపోతుంది. మళ్ళీ తెల్లవారి వరగడుపే! రామారావు పాత పాటనే కొత్తరాగంతో మొదలుపెడతాడు.

పోనీ యింట్లో మరెవ్వరూ లేకుండా తనూ, ఆయనా, బేబీమాత్రమే అయితే భర్త మాటల్ని అంతగా పట్టించుకొనేది కాదేమో! కాని చెట్టంత మరదులిద్దరూ, అత్తమామలూ వుండగా తనతో యిదా వరస? అసలు ఆ మరదులిద్దరినీ చూస్తేనే తనకోవిధమైన జంకు. తను కాపరానికి వచ్చి మూడుసంవత్సరాలైనా— వాళ్ళెవరూ తనని "వదినా!" అని పిలవలేదు. తనని చూస్తేనే తల వొంచుకొని పక్కకి తప్పుకు పోతారు. మంచినీళ్ళు కావాల్సి వచ్చినా, అత్తగారినో, లేకపోతే వుయ్యాలలో వున్న 'బేబీ'నో పిలిచి మంచినీళ్ళు కావాలంటూరు. తను తీసికెళ్ళి దూరంగా పెడితే అందుకుంటారంతే. పోనీ- అన్నదమ్ములన్నా అధికంగా మాటాడుకోరు. భోజనాలకి కూర్చున్నా ఎవరిమట్టుకు వాళ్ళు నిశ్శబ్దంగా భోంచేసి లేచిపోతారు. ఎప్పుడైనా మావఁగారు తనంతట తాను ఏదైనా ప్రస్తావన తెస్తేనే భోజనాల దగ్గర కాసేపు కులాసాగా నవ్వుకుంటారు. మళ్ళీ మరుక్షణమే నిశ్శబ్దం ఆ యింటిని ఆవరిస్తుంది. యిటువంటి గంభీరమైన వాతావరణంలో సాగే ఆ సంసారంలో పార్వతి ఎప్పుడూ తనని తాను ఎంతో సంబాళించుకొని తిరుగుతుంది. అప్పటికీ రామారావు ఏదో సాకుతో తనని ఏడిపించడానికి పూనుకుంటే తను అభిమానపడక చేసేదేముంది?

ఇవాళటిది ఏమంత పెద్దవిషయమని!—ఆయనా, మరదులూ భోంచేస్తున్నారు. అత్తగారు దగ్గరుండి వడ్డిస్తూవుంది. అదేసమయానికి వీధిలో ముష్టివాడు "సందా కవళం తల్లీ!"అని విడవకుండా గోలపెడుతున్నాడు. అసలు భోజనం సమయంలో ఏవరైనా బిచ్చగాళ్లు వస్తే నోటితో లేదనేబదులు, చేతితో లేదనాలని అత్తగారిప్రిన్సిపల్. అందుకే తను అంది: "అత్తయ్యా! కాస్త ప్లేట్లో అన్నం పెట్టివ్వండి, ఎవడో ముష్టివాడు గుమ్మంలో వదురుతున్నాడు" అని.

ఈపాటిదానికే రామారావు యింత రాద్ధాంతం చెయ్యాలా!

"ఁమ్మా! ఎవరికే ప్లేట్లో అన్నం అందివ్వమంటూంది? వాళ్ళ అన్నయ్యగాని వచ్చేడా?"

"ఛ! అదేమిట్రా ముష్టివెధవని దా నన్నయ్యంటావ్!"

"ముష్టివాడా! అయ్యబాబోయ్! ఈ దాతృత్వం ఎప్పటినుంచి నేర్చుకుందమ్మా నీ కోడలు?"

"ఏమిట్రా రామూ నువ్వు మరీనూ! దాన్నంత పిసినారికింద తీసేస్తావేరా?'

"ఓస్, కాకపోతే! ఎంగిలిచేత కాకిని కొట్టని కమలమ్మత్త కూతురు డొక్కా సీతమ్మవుతుందటమ్మా! అల్లుడికే అయిదువందల రూపాయలకి టోపీపెట్టిన కమలమ్మత్త కూతురుకి దాతృత్వం నేర్పుతుందా?"

ఆ మాటలు విని మరదలిద్దరూ ముసిముసినవ్వులు నవ్వుకున్నారు. పాపం! పార్వతికి అభిమానం ముంచుకొచ్చి కళ్ళనీళ్ళపర్యంతం అయింది.

మాటిమాటికీ యీ అయిదువందలని గురించి ఎందుకో రామారావు తనని దెప్పడం? అంత అయిదువందలే కావాల్సినవాడైతే ఆ రోజునే పెళ్ళిపీటలమీదనుండి లేచిపోలేకపోయ్యాడూ! యింతకీ యిందులో అమ్మచేసిన మోసంమాత్రం యేముంది? నాన్న లేకపోయినా, ఎలాగో సంసారాన్ని పొదుపుగా దిద్దుకుంటూ, తమని పెద్దవాళ్ళని చేసింది. రామారావుకి రెండు వేలు కట్నం యివ్వడానికి ఒప్పుకొన్నమాట వాస్తవమే. కాని తీరా సమయానికి డబ్బు సర్దుబాటు కాక, మామగారిని చాటుగా పిలిచి, పదిహేను వందలు యిస్తూ చేతులుపట్టుకొని—

"అన్నయ్యా! యివి చేతులు కావు, కాళ్ళనుకో! సమయానికి సర్దుబాటు కాకపోయింది. మిగతా అయిదువందలూ తరవాత ముట్టజెప్పుకుంటాను. డబ్బుకోసమని యీ శుభకార్యం మాత్రం ఆపవద్దన్నయ్యా!"అని బతిమాలింది అమ్మ.

పాపం మామగారుకూడా కష్టసుఖాల్నెరిగిన సహృదయుడు గనక—

"పోనీ అలాగే కానీయమ్మా! కాని యీ డబ్బునే కవర్లోపెట్టి, రెండువేలని కట్నంక్రింద చదివించెయ్యి. మళ్ళీ నలుగురికీ యీ విషయాలు తెలుపుకొని మనం లోకువ అవడమెందుకూ?"అన్నాడు.

నిజంగా యీ విషయం-పెళ్ళి అయాక అమ్మ చెప్పేవరకూ తనకు తెలియదు. తెలిసిననాడే తను రామారావుకి క్షమాపణ చెప్పుకుంది.

"ఇప్పుడా గొడవంతా యెందుకు పోనిద్దూ" అని చిరునవ్వు నవ్వాడు రామారావు.

కాని రామారావు యీనాటికీ, ఆ అయిదు వందలగురించి దెప్పిపొడుపులుమాత్రం మానలేదు. పోనీ డబ్బంటే దురాశేమో అంటే-అదీ ఎక్కడా కనిపించ దాయనలో. అలకపాన్పునాడు కూడా అమ్మ స్వయంగా తలుపుపక్క నిలబడి "నాయనా! నీకు సైకిలో వాచీయో ఏది కావాలంటే అది కొనుక్కో" అంటే—

"నాక్కావాల్సివచ్చిన రోజున మిమ్మల్నడుగుతాలెండి"అన్నాడు రామారావు నవ్వుతూ.

సాధారణంగా పండగలకి కూడా ఏదో సాకు చెప్పి రావడమే మానేస్తాడు. ఒకవేళ వచ్చినా, చివరికి బట్టలుపెట్టినా తీసుకోవడానికి ఒప్పుకోడు. అమ్మ మరీ బలవంతం చేస్తే—

"ఎందుకత్తాయ్! అనవసరమైన ఆడంబరాలకి పరుగులు తీస్తావ్. నువ్వు పండుగ బహుమానాలివ్వలేదని మీ అమ్మాయిని నేనేమీ రాసిరంపాన పెట్టనులే అత్తాయ్" అంటాడు. అమ్మ ఆనందాని కంతుండదు. ఆయన మంచితనం చూచి రాధ కూడా అంటుంది:

"ఎంత మంచి మొగుణ్ణి కొట్టేశావే పారూ!" అని. మరి అలాంటి రామారావు అదను దొరికినప్పుడల్లా-యీ అయిదు వందల వూసెత్తి తననెందుకు ఏడిపిస్తాడో అర్థంకాదు. ఆ మిషనికననివుడికించడం యిది మొదటిసారేమీ కాదు. మొన్నా యింతే—

"ఏవండీ! బేబీకి పుట్టిన రోజు పండక్కి ఒక మంచి నెక్లెస్ చేయించాలండీ" అని తనంటే—

"మీ అమ్మగారివ్వాల్సిన ఐదువందలూ వున్నాయిగా అవి వసూలయాక అలాగే చేయిద్దాంలే!"

నిజంగా పార్వతికి వళ్లు మండింది.

"అంత ఐదువందలు కావాల్సినవాళ్లు మా అమ్మనే ఎందుకడగరూ? నన్నెందుకు సాకుతో సాధించడం?"

"నేనలాగ వసూలుచేసే దశమగ్రహాన్ని కాదని తెలిసే మీ అమ్మ అయిదు వందలకి చమ్కీటోపీ పెట్టింది. అయినా అవి యింత త్వరగా వసూలు చేసేసుకుంటే రోజూ-కాసేపు నిన్ను రుసరుసలాడించడం ఎట్లా!" యీ దెబ్బతో పార్వతికి ఉక్రోషం మరీ ఎక్కువయింది.

"అబ్బా! అప్పుడే ఎంత కోపమో! ఆ బుంగమూతి చూడు ఎలావుందో- కోదండరామయ్యగారి పిలకలాగ."

పార్వతికి బుసలుకొట్టే కోపం వచ్చింది. పాపం! ఏంచేస్తుంది! ఆడది. అందులో అర్థాంగి. ఆ కోపమంతా కన్నీరుగా మారిపోయింది. తనని ఎంతచులకనా చూడక పోతే తన మూతిని కోదండ రామయ్యగారి పిలకముడితో పోలుస్తాడు రామారావు—

అదేమిటో కోదండరామయ్యగారి పిలక ముడంటే పార్వతికంత నిరసన—పార్వతికేకాదు ఆ వూళ్ళో అందరికే అంటే! పురాణం చెప్పే కోదండరామయ్యగారి పిలకని ఏదోఒక సందర్భాన్ని కల్పించి ఉపమానంగా ఉటంకించని వాళ్ళంటూ లేరా వూళ్ళో! అసలాయనగారి "పిలకముడి" "సెవెన్ వండర్స్ ఆఫ్ దివరల్డు"లో ఒకటని ఆ వూళ్ళో వాళ్ళనమ్మకం. ఎందుకంటే ఆయన నెత్తి మీదది పిలకముడో, లేక నల్ల చేవక్ర పిడో తెలుసుకోవడం కష్టం. ఆ పిలకలో ముడి ఎక్కడ ఆఖరవుతుందో "డిస్కవర్" చేయడం సులభ సాధ్యంకాదు. కాని నూనెరాసి, నున్నగా దువ్విన ఆద్యంతరహితమైన పిడికెడు వెంట్రుకల "పిలకముడి" మాత్రం కోదండరామయ్యగారి బోడినెత్తిన సర్వదా—ఏమార్పూలేకుండా శోభిస్తూనేవుంటుంది.

రామారావు తన బుంగమూతిని కోదండ రామయ్యగారి పిలకముడితో పోల్చడం తలుచుకునే సరికి పార్వతికి ఒళ్ళు జలదరించి—ఛీ! అనుకుంది. గడియారం అరగంట కొట్టింది. రాత్రి తొమ్మిదన్నర అయినా, స్నేహితులతో బయటికి వెళ్ళిన రామారావు యింకా రాలేదు. ఏమిటో పొద్దుపోయి ఏంపెత్తనాలో!

బేబీ యేడుపు శ్రుతి హెచ్చిస్తోంది. అప్పుడే గుమ్మంలో—

"అమ్మా! ఒక ముద్దుంటే ఎయ్యితల్లీ!"

"వెధవలు. అర్ధరాత్రయినా, యీ అడుక్కునే వెధవలు వదలరు" విసుక్కుంది పార్వతి.

"ఒక ముద్దుంటే యెయ్యి తల్లీ!"

బేబీ యేడుపుని మించి మొత్తుకుంటున్నాడు బిచ్చగాడు.

పార్వతికి పళ్ళు మండింది. వెధవలు - ముష్టి వెధవలు, యీ ముష్టివెధవలవల్లే ఈ వేళ అవమాన పడవలసి వచ్చింది.

"ఫోరా! భోజనాలయి, అంతా పడుకున్నాం ఫో."

"పుణ్యముంటుందమ్మా! ధర్మతల్లీ!"

"ఫోరా, ఫో!"

బిచ్చగాడు అరవడమూ మానలేదు - బేబీ యేడుపూ మానలేదు. బేబీ ఏడుపూ, ముష్టివాడి అరుపూ పోటీపడుతున్నాయి.

పైగా ముష్టివెధవ తలుపు తడుతూ "ఒక ముద్దెయ్యమ్మా" అంటున్నాడు.

పార్వతికి కోపం కట్టలు తెంచుకుంది.

"చెపుతుంటే నీక్కాదట్రా ముష్టివెధవా!" అని తలుపుతీసి గద్దించింది.

తలకు చుట్టిన తువాలు తీసేస్తూ—

"భళిరా! ఎంతటి ధర్మ దేవత వు..." అని పాడుతూ లోపలికి వచ్చాడు రామారావు. పాపం! పార్వతి నిర్ఘాంతపోయింది.

"ఏం? ఇందాక ఆ మాటన్నానని ఉలికులికి పడ్డావే? ఇప్పుడు బయటపడిందా అసలు రంగు!"

పార్వతికి, అభిమానమూ, కోపమూ ముంచుకొస్తున్నాయ్. పెదవులు వణుకుతున్నాయ్.

రామారావు యింకా... వేళాకోళపు ధోరణి లోనే "అదుగో! అప్పుడే ఆ బుంగమూతి యెలా పెట్టిందో!" అన్నాడు.

పార్వతికి ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది. మళ్ళీ రామారావు తన బుంగమూతిని, కోదండ రామయ్యగారి "పిలక పిడి"తో పోలుస్తాడు కాబోలు-యీ మాట తలచుకునేసరికి పార్వతి కళ్ళలోంచి నీళ్ళు జలజలా రాలాయ్.

పాపం! పార్వతి కన్నీరు చూచి తెల్లబోయాడు రామారావు.

"అదేమిటి పారూ! ఛా! నిజంగా యీమాత్రం దానికే నువ్వింతగా యిదవుతావనుకుంటే నే నలా అనేవాణ్ణి కాదు పారూ!" అంటూ పార్వతిని దగ్గరికి తీసుకున్నాడు.

రామారావు బుజ్జగింపుతో పార్వతి దుఃఖం పొంగి పొరలింది.

పార్వతి చెంపకి తన ముఖం ఆనిస్తూ జాలిగా "నన్ను క్షమించు పారూ!" అన్నాడు రామారావు.

"ఛా! అవేం మాటలండీ" అంటూ రామారావు నోటిని తన బుగ్గతో మూసేస్తూ... అతని మెడను రెండు చేతుల్తోనూ చుట్టేసింది పార్వతి. ★